రంగస్థల ప్రదర్శనలకు ప్రోత్సాహం

- కళాకారులకు ఆదరణ
- 46 ఏళ్లుగా అమలాపురం శ్రీదేవి ఉత్సవ కమిటీ సహకారం
- ప్రేక్షకులను అలరిస్తున్న సాంఘిక, పౌరాణిక నాటకాలు


అమలాపురం శ్రీదేవి ఉత్సవ కమిటీ వేదికపై ప్రదర్శించిన చింతామణి నాటకంలోని ఓ దృశ్యం


శ్రీకృష్ణ తులాభారం నాటకంలోని ఓ సన్నివేశం

అమలాపురం టౌన్: ఆధునికతను ఆహ్వానిస్తున్న నేటి తరం పూర్వం నుంచి వస్తున్న ఆచారాలు, సంప్రదాయ వినోదాల వైపు అంతగా ఆసక్తి చూడడం లేదు. ఫలితంగా రంగస్థలం మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ఈ క్రమంలో అమలాపురంలో ఏటా నిర్వహించనున్న దసరా శరన్నవరాత్ర ఉత్సవాల చలువ పందిరిలో శ్రీదేవి అమ్మవారి ఆలయానికి చెందిన ఉత్సవ కమిటీ రంగ స్థలాన్ని ఆదుకునేందుకు, కళాకారులను ప్రోత్సహించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తోంది. ఏటా దసరా ఉత్సవాలకు తొమ్మిది రోజులూ పౌరాణిక, సాంఘిక నాటకాలను ప్రదర్శింప చేసి రంగస్థల అభిమానుల అభిలాషను కొంత తీర్చుతోంది.

కళాకారుల ఫొటోల ముద్రణతో ఆహ్వాన ప్రతిక

శ్రీదేవి ఉత్సవ కమిటీ రంగ స్థలాన్ని, కళాకారులను ప్రోత్సహించడమే కాకుండా చివరకు శరన్నవ రాత్ర ఉత్సవాల ఆహ్వాన పత్రిక ముద్రణలోనూ ప్రత్యేకత చాటుతోంది. ఈ ఆహ్వాన పత్రికను అతి పెద్దగా (జంబో) రెండున్నర అడుగులు పొడుగు, మూడున్నర అడుగుల వెడల్పులో రంగ రంగులతో ముద్రించారు. ముఖ్యంగా పౌరాణిక, సాంఘిక నాటకాల సమాచారాన్ని, ఆ కళాకారుల ఫొటోలతో ముద్రించారు. రంగస్థలాన్ని ఉద్ధరించడం ధ్యేయంగా ఆ కమిటీ 46 ఏళ్లుగా తన వంతు తోడ్పాటునందిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెండు మూడు కళా పరిషత్‌లు, గణపతి, దేవి నవరాత్రులను నిర్వహించే ఉత్సవ కమిటీలు మాత్రమే రంగ స్థలాన్ని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నాయి.

కోనసీమ రంగ స్థల అభిమానులకు కనుల పండువ

శ్రీదేవి ఉత్సవ కమిటీ ఏటా దసరా ఉత్సవాలకు రూ.లక్షలు వెచ్చించి రాష్ట్రంలోని రంగ స్థల కళా మండళ్లు ప్రదర్శించే పౌరాణిక, సాంఘిక నాటిక, నాటకాలను అమలాపురం వేదికపై ప్రదర్శింప చేస్తోంది. ఈ నాటకాలను కనులారా వీక్షించేందుకు కోనసీమ వ్యాప్తంగా ఉన్న రంగ స్థల అభిమానులు దసరా తొమ్మిది రోజులూ శ్రీదేవి చలువ పందిరికి తరలివస్తారు. రాత్రి 10 గంటలకు ప్రదర్శనలు మొదలై తెల్లవారు 2 నుంచి 3 గంటల వరకూ కొనసాగుతాయి. ప్రేక్షకులు ఓపిగ్గా కూర్చుని వాటిని వీక్షిస్తారు. సత్య హరిశ్చంద్ర, కురుక్షేత్రం, బాల నాగమ్మ, శ్రీకృష్ణ తులాభారం వంటి పౌరాణిక నాటకాలతో పాటు చింతామణి వంటి సాంఘిక నాటకాలతోపాటు పలు జానపద నృత్యాలు ప్రజలను అలరిస్తున్నాయి. ప్రదర్శన అనంతరం ఉత్సవ కమిటీ తరపున కళాకారులను సత్కరించే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

సంతృప్తి కోసమే



ఏటా దసరా ఉత్సవాల కోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నాం. పౌరాణిక, సాంఘిక నాటికలు, నాటకాల ప్రదర్శన ద్వారా కళాకారులను ప్రోత్సహిస్తున్నాం. రాష్ట్రంలోని ప్రముఖ రంగ స్థల కళా సమితిలు, మండళ్లకు చెందిన దాదాపు 300 మంది కళాకారులను మా ఉత్సవ కమిటీ ఆదరిస్తోంది. అన్ని వర్గాల ప్రేక్షకుల అభిరుచి మేరకు ఆధునికత సాంకేతికతతో నాటకాలను ప్రదర్శింప చేసి అలరించేందుకు కృషి చేస్తున్నాం.

– గంగాబత్తుల రాంబాబు, చైర్మన్, శ్రీదేవి ఉత్సవ కమిటీ, అమలాపురం

క్లుప్తంగా

ఫలపుష్ప ప్రదర్శన ఏర్పాట్లపై సమీక్ష


సమావేశంలో పాల్గొన్న అంకితేకుమార్, చిత్రంలో మల్లాడి

యానాం: పుదుచ్చేరి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది స్థానిక బాలయోగి స్టేడియంలో జనవరి 6 నుంచి ప్రారంభించే ఫల, పుష్ప ప్రదర్శనకు సంబంధించి ఏర్పాట్లపై మంగళవారం ఐఏఎస్ అధికారి, ఆర్ఏఓ అంకితేకుమార్ అధ్యక్షతన స్థానిక ఆర్ఏఓ ఆఫీసులో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొని చేయాల్సిన ఏర్పాట్లు తదితర వాటిపై చర్చించారు. ఫలపుష్ప ప్రదర్శన విజయవంతం చేసేందుకు 3 నెలల ముందు నుంచే అవసరమైన పూల మొక్కలను వివిధ ప్రాంతాల నుంచి తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. ఫలపుష్ప ప్రదర్శనను 4 రోజుల పాటు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వరదరాజన్, వ్యవసాయాధికారి జోగిరాజు, విద్యాశాఖాధికారి లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఆర్‌కే కళాశాల ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, పీడబ్ల్యూడీ ఏఈ జ్యోతిరాజు పాల్గొన్నారు

కంటి వైద్య శిబిరం


కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ వరదరాజన్

యానాం: సేవా పక్వాడా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో యానాం పోలీస్‌శాఖ ద్వారా గ్రామాల్లో వివిధ సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్గించే విధానంలో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు మంగళవారం ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా దరియాలతిప్పలో ప్రజాదర్బార్ ఏర్పాటు చేసామని తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు, వారి కుటుంబాలకు కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. సావిత్రినగర్ స్కూల్లో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఆర్ఏఓ అంకిత్ కుమార్ ప్రారంభించారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన రచయిత పుత్సా కృష్ణ కామేశ్వర్ రాసిన శ్రీరామ రక్షా స్తోత్రం తాత్పార్య పుస్తకావిష్కరణ స్థానిక భూపయ్య అగ్రహారంలో మంగళవారం జరిగింది. ఆధ్యాత్మిక గ్రంథ రచయిత చక్కా సత్యనారాయణమూర్తి, భూపయ్య అగ్రహారం బాల భక్త సమాజం ప్రతినిధి కూచిమంచి కృష్ణ మాట్లాడుతూ రచయిత కృష్ణ కామేశ్వర్ ఆధ్యాత్మిక సేవను కొనియాడారు. ఈ సందర్భంగా రచయిత కృష్ణ కామేశ్వర్‌ను సత్కరించారు. గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధి గోటేటి లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్కిల్ ప్రతినిధులు గోటేటి గంగాధరరావు, యర్రమల్లి అనంలక్ష్మి, కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

తాళ్లరేవు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో మార్కెటింగ్ నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చని భీమాబాయి మహిళా మండలి చీఫ్ జస్టిస్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన తెలిపారు. మంగళవారం స్థానిక భీమాబాయి మహిళా మండలి కార్యాలయంలో నైపుణ్యాభివృద్ధి మార్కెటింగ్ నైపుణ్యాలు అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నందివర్ధన మాట్లాడుతూ మహిళలకు కిశోర బాలికలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయ మార్గం పెంపునకు ఉపయోగపడతాయన్నారు. స్థానిక వీఆర్వో లోవరాజు, మహిళా మండలి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

యానాం: నియోజకవర్గ తీరప్రాంత గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని ఆర్ఏఓ అంకిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సావిత్రినగర్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంకిత్‌కుమార్‌కు వైద్యులు మొక్క అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ డీడీటీ రవిశంకర్, వైద్యురాలు డాక్టర్ శేరు నవ్య పాల్గొన్నారు.

రీజెన్సీ పరిశ్రమ పునఃప్రారంభానికి సహకరించాలి


అంకిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జీఎన్ నాయుడు

యానాం: రీజెన్సీ సిరామిక్స్ భారీ పరిశ్రమను పునఃప్రారంభానికి తాము చేస్తున్న ప్రయత్నాలకు ప్రభుత్వం సహకారం అందించాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎన్ నాయుడు కోరారు. మంగళవారం ఆయన నూతన ఆర్ఏఓగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి, ఆర్ఏఓ అంకిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2012లో జరిగిన దుర్ఘటన సందర్భంగా వేలాదిమంది కార్మికులకు ఉపాధి కల్పించే సంస్థ మూతపడిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి తాము రూ.కోట్లకుపైగా ఖర్చుతో మరమ్మతులు, నూతన మిషనరీ కొనుగోలుకు తదితర మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వపరంగా తమకు సహకరించాలని గ్యాస్ పంపిణీ, విద్యుత్ తదితర సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ద్వారా అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజెన్సీ ప్రారంభమైతే యానాంకు మళ్లీ పూర్వవైభవం వస్తుందని జీఎస్టీ పన్నుల రూపంలో ప్రభుత్వానికి కోట్లాది రూపాయల రెవెన్యూ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రీజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం


నల్లా సూర్యప్రకాష్


ఎస్.యానంలో ఎస్సీ సెల్ నియోజవర్గం అధ్యక్షుడిగా నియమితులైన గెడ్డం కిరణ్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: అమలాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుడిగా మండలంలో ఆయా గ్రామాలకు చెందిన నాయకులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అమలాపురం నియోజకవర్గం అధ్యక్షుడిగా ఎస్.యానంకు చెందిన గెడ్డం కిరణకుమార్, ఆర్‌టీఐ విభాగం నియోజకవర్గం అధ్యక్షుడిగా వానపల్లిపాలెంకు చెందిన నల్లా సూర్యప్రకాష్, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలుగా ఎస్.కొత్తపల్లికి చెందిన పేరిచర్ల వరలక్ష్మి నియమితులయ్యారు. ఈ సందర్భంగా గెడ్డం కిరణ్‌ను పార్టీ నాయకులు మంగళవారం ఎస్.యానంలో దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే శ్రీను, తాడి గోపాలకృష్ణ, పెయ్యిల రమణ, రేవు రాజేష్, మూదే దుర్గబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత దుర్గారావు కన్నుమూత

తాళ్లరేవు: నీలపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గంజా దుర్గారావు మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దుర్గారావు అకస్మాత్తుగా కుప్పకూలిపోవడంతో కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. రూ.లక్షలు ఖర్చు చేసినా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా దుర్గారావు మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేసారు. దుర్గారావు మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, నాయకులు రెడ్డి సతీష్, పలివెల కొండ, కట్టా దుర్గారావు తదితరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు.

జాతీయస్థాయి పోటీలకు రిషితశ్రీ ఎంపిక


కాకినాడలో రిషితశ్రీకి పతకాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవుకు చెందిన పాకలపాటి రిషితశ్రీ మోడరన్ పెంటాథ్లాన్ అథ్లెటిక్స్‌లోని రన్నింగ్, స్విమ్మింగ్ విభాగంలో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ంది. ఇటీవల కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బయోథ్లాన్ పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచి వెండి పతకాన్ని గెలుచుకుంది. అక్టోబరు 5 నుంచి 7వ తేదీ వరకు ఇండోర్‌లో నిర్వహించే జాతీయస్థాయి మోడరన్ పెంటాథ్లాన్, బయోథ్లాన్ పోటీల్లో పాల్గొననున్నట్లు రిషితశ్రీ తెలిపింది. తమ కోచ్ నరాల శ్రీహరిబాబు శిక్షణ కారణంగానే తాను ఈ ఘనత సాధించినట్టు ఆమె తెలిపింది. రిషితశ్రీని తల్లిదండ్రులు పాకలపాటి విజయ, రాజ్‌వర్మ, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్, కంటిపూడి గణేశ్వరరావు తదితరులు అభినందించారు.

మహిళలకు వైద్య పరీక్షలు

అమలాపురం రూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుందని ఈదరపల్లి సర్పంచ్ రాయుడు వరలక్ష్మి అన్నారు. బండారులంక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈదరపల్లి సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్యవంతమైన మహిళ - శక్తివంతమైన కుటుంబం వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య అధికారులు గౌతమి, అన్నామని ఆధ్వర్యంలో మహిళలు, బాలికలకు ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్యంలో కేవీఆర్‌ది ప్రత్యేక స్థానం


కన్నెబోయిన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

అమలాపురం టౌన్: ప్రాచీన ఆధునిక సాహిత్యంలో కవి కన్నెబోయిన వెంకటేశ్వరరావు (కేవీఆర్)ది ప్రత్యేక స్థానమని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి అన్నారు. స్థానిక శ్రీకళా గ్రాండ్ రెసిడెన్సీలో మంగళవారం కవి కన్నెబోయిన వర్ధంతి సభ జరిగింది. కోనసీమ రచయితల సంఘం కన్వీనర్ మెండి కమల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ, అధ్యాపకునిగా నాలుగు దశాబ్దాలుగా పనిచేసిన కన్నెబోయిన సాహితీ వెలుగులు నింపారని కొనియాడారు. వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత కన్నెబోయిన చిత్రపటానికి నివాళులర్పించారు. సాహితీ అభిమానులు యడ్ల సురేష్‌కుమార్, సబ్బతి రాంబాబు, గొల్లపల్లి గోపి, కుసుమ విజేష్, గెల్లా స్వాతి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీ రాంబాబు సేవలు అభినందనీయం


హెడ్ కానిస్టేబుల్ రాంబాబు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా, ఏఎస్పీ

అమలాపురం టౌన్: జిల్లా పోలీస్ శాఖలో మూడు దశాబ్దాల పాటు పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ సంసాని రాంబాబు సేవలు అభినందనీయమని ఎస్పీ రాహుల్ మీనా అన్నారు. రావులపాలెం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సంసాని రాంబాబు మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా స్థానిక కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు సభలో ఎస్పీ మాట్లాడారు. అనంతరం రాంబాబు దంపతలను ఎస్పీతోపాటు ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ తదితరులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఏఆర్ ఆర్ఐ కోటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచి సీఐ పుల్లారావు, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాసరావు, రావులపాలెం సీఐ శేఖర్‌బాబు తదితరులు పాల్గొని హెడ్ కానిస్టేబుల్ రాంబాబు సేవలను కొనియాడారు.

ఓఎన్‌జీసీ అధికారులపై ఆగ్రహం

మామిడికుదురు: పాశర్లపూడి బాడవలో ఓఎన్‌జీసీ పైప్‌లైన్ లీకేజీని అదుపు చేసేందుకు మంగళవారం అక్కడికి జేసీబీతో చేరుకున్న సిబ్బందిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ లీకేజీ ఏర్పడలేదంటూ తప్పుడు ప్రకటన ఎందుకు చేశారో వివరణ ఇవ్వాలని నిలదీశారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది స్థానికులను శాంతింపజేశారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో పైపునకు రిపైర్స్ చేసి లీకేజీని అదుపు చేశారు.

బ్రాహ్మణ ఫౌండేషన్ వితరణ


ఫౌండేషన్ సమకూర్చిన వస్తువులతో వృద్ధాశ్రమ నిర్వాహకులు

అమలాపురం టౌన్: కోనసీమ బ్రాహ్మణ స్ఫూర్తి ఫౌండేషన్ (కేబీఎస్ఎఫ్) స్థానిక ఎస్‌కే ఓల్డ్ ఏజ్ హోమ్‌కు పలు వస్తువులను సమకూర్చింది. వృద్ధాశ్రమానికి అవసరమైన ఇనుప బీరువా, 4 ఫ్యాన్లు, వంట గ్యాస్ కనెక్షన్‌తో సిలిండర్, వాషింగ్ మెషిన్, వాటర్ మోటర్ తదితర వస్తువులను మంగళవారం అందించింది. ఇక నుంచి ఫౌండేషన్ ప్రతి నెలా వృద్ధాశ్రమానికి రెండు బస్తాల బియ్యం సమకూర్చనుంది. ఫౌండేషన్ అధ్యక్షుడు అక్కిరాజు రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐదేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న బ్రాహ్మణ స్ఫూర్తి ఫౌండేషన్‌ను 16 మంది బాల్య స్నేహితులు నెలకొల్పారు. వీరిలో కొందరు చెన్నైలో, అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు.

దుర్గాదేవిగా అమ్మవారి దర్శనం


తాళ్లరేవు కనకదుర్గ ఆలయంలో సామూహిక కుంకుమపూజలు చేస్తున్న మహిళలు


ఇందుపల్లిలో సువాసినీ పూజలో పాల్గొన్న ముత్తయిదువలు


150 కిలోల పసుపు కొమ్ముల అలంకరణలో సుబ్బాలమ్మ

అమలాపురం రూరల్: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈదరపల్లి వంతెన వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఇమ్మిడివరప్పాడులో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలోని గోగులమ్మ వారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, కాత్యాయనీ పూజ

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో పాలకనకదుర్గమ్మ ఆలయంలో అర్చకులు గోపూజ, కాత్యాయనీ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాతకోరంగి శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు, కుమారి పూజల నిర్వహించారు. తాళ్లరేవు పరదేశమ్మ వీధిలోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి కుంకుమ పూజలు చేసారు.

వైభవంగా సువాసిని పూజ

అమలాపురంరూరల్: ఇందుపల్లిలో శ్రీబాల భక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సువాసిని పూజ వైభవంగా నిర్వహించారు. తొమ్మిది మంది ముత్తయిదువలను నవదుర్గలుగా కొలుస్తూ పూజ నిర్వహించారు.

పసుపు కొమ్ములతో సుబ్బాలమ్మకు అలంకరణ

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మను మంగళవారం 150 కిలోల పసుపు కొమ్ములతో అలంకరించారు. అమలాపురానికి వాసి ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డ సలాది సుబ్బారావు, యుగ సంధ్య దంపతుల ఆర్థిక సహాయంతో అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్య నాయుడు, కమిటీ సభ్యులు యర్రంశెట్టి మూర్తి, నిమ్మకాయల నాగేశ్వరరావు, అరిగెల బాబ్జి తదితరుల పర్యవేక్షించారు.

కామాక్షీ పీఠానికి పూజా సామగ్రి అందజేత

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో రూ.20 వేల విలువైన పూజా సామగ్రి, ప్రసాద తయారీ సరుకులను వాసవీ క్లబ్ ప్రతినిధులు మంగళవారం సమకూర్చారు. క్లబ్ ప్రతినిధి, పట్టణ ఆర్యవైశ్య నాయకుడు గ్రంధి సతీష్ సహకారంతో వీటిని క్లబ్ ప్రతినిధులు అందజేశారు. క్లబ్ ప్రతనిధులు వంకాయల వీవీ సత్యనారాయణ, తటవర్తి వెంకట రమణమూర్తి, పద్మనాభం గణేష్ తదితరులు పూజా సామగ్రిని పీఠం మేనేజర్ మర్రి దుర్గారావుకు వీరు అందించారు.

విజయలక్ష్మి దుర్గమ్మకు సహస్ర కుంకుమార్చన

కాట్రేనికోన: గద్దనపల్లి పంచాయతీ శివారు చింతలమెరకలో వేంచేసి ఉన్న విజయలక్ష్మి దుర్గమ్మ ఆలయంలో తొమ్మిదో రోజు దుర్గమ్మకు సంసాని కాసులు కుటుంబ సభ్యులతో సహస్ర కుంకుమార్చన పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు దుర్గమ సహస్ర నామార్చనతో కుంకుమ పూజ చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన వుంగరాల


ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన పిల్లి సూర్యప్రకాష్, వుంగరాల

తాళ్లరేవు: మద్యం అక్రమ కేసులో బెయిల్‌పై విడుదలైన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని రాజమండ్రి విమానాశ్రయంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్, రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ కలిసారు. మిథున్‌రెడ్డికి బెయిల్ రావడంపై వారు హర్షం వ్యక్తం చేసారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులపై కావాలనే కేసులు పెడుతూ వేధిస్తున్నారని సంతోష్ మాట్లాడుతూ ఆరోపించారు.

దేశ సంస్కృతి సంప్రదాయాలను ఆచరించాలి

అమలాపురం టౌన్: హిందూ ధర్మ పరిరక్షణ తల్లుల చేతుల్లోనే ఉందని సంస్కార భారతి కోనసీమ ప్రతినిధి గోకరకొండ బలరామ గోవిందం సూచించారు. దేశ సంస్కృతి, సంప్రదాయలు, ఆచార వ్యవహారాలన్నీ పిల్లలు ఆచరించేలా తల్లులే బాధ్యత తీసుకోవాలన్నారు. దుర్గాష్టమి సందర్భంగా పట్టణంలోని అన్నాబత్తుల వారివీధి, నల్లా వీధి, గండు వీధి, గీతా మందిరం, కృష్ణ మందిరాల్లో మంగళవారం బలరామ గోవిందం ఆధ్మాతిక ప్రసంగాలు చేశారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

సభలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తీసుకోవాలి

అమలాపురం టౌన్: విజయ దశమి ఉత్సవాలు, ఊరేగింపు నేపథ్యంలో ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకూ అమలాపురం పోలీస్ సబ్ డివిజన్‌లో సెక్షన్ 30 పోలీస్ చట్టం అమలులో ఉంటుందని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ మంగళవారం పేర్కొన్నారు. ఈ సెక్షన్ అమలు ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించకూడదని తెలిపారు. అలాంటి కార్యకలపాలు నిర్వహించే ముందు అమలాపురం డీఎస్పీ నుంచి అనుమతి పొందాలన్నారు. ఈ విషయాన్ని పోలీస్ సబ్ డివిజన్‌లో అందరూ ముఖ్యంగా ఉత్సవాల నిర్వాహకులు, ఊరేగింపుల కమిటీల ప్రతినిధులు గమనించాలని సూచించారు. సబ్ డివిజన్‌లోని అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలో సెక్షన్ 30 అమలులో ఉంటుందని డీఎస్పీ ప్రసాద్ తెలిపారు.

సూర్య ఘర్ యోజనపై నేడు ర్యాలీ

అమలాపురం రూరల్: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అమలాపురంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్ నుంచి గడియారస్తంభం సెంటర్ వరకు నిర్వహించనున్న ర్యాలీని ఉద్యోగులు విజయంతం చేయాలని ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ రాజేశ్వరి సూచించారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన సేవా పర్వ్‌లో భాగంగా అక్టోబర్ 2వరకు జిల్లాలో ప్రచారం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

2న మద్యం దుకాణాల మూసివేయాలి

యానాం: లిక్కర్ షాపులను ఈనెల 2 గాంధీ జయంతి సందర్భంగా మూసివేయాలని మంగళవారం డిప్యూటీ కమిషనర్ (ఎక్సైజ్) అంకిత్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లిక్కర్ షాపులతో పాటు లిక్కర్‌ను సరఫరా చేసే బార్ అండ్ రెస్టారెంట్లు, బార్‌లు మూసివేయాలని ఈ విషయాన్ని ఆయా యాజమాన్యాలు గ్రహించాలని ఆదేశించారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసారని తెలిపారు.

110 నూతన రవాణా వాహనాలకు రిజిస్ట్రేషన్లు

అమలాపురం రూరల్: వారం రోజుల్లో జిల్లాలో సుమారు 110 నూతన రవాణా వాహనాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని జిల్లా రవాణాశాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. జీఎస్టీ తగ్గుదల నేపథ్యంలో దసరా పండుగ సందర్భంగా వాహనాదారులు పెద్ద సంఖ్యలో వాహనాలు కొనుగోలు చేస్తున్నారని డీటీఓ పేర్కొన్నారు. 80 పాసింజర్ ఆటో రిక్షాలు, 10 లైట్ గూడ్స్ వాహనాలు, 10 మోటార్ క్యాబ్‌లు, 5 ఎలక్ట్రిక్ వాహనాలు, 5 పది చక్రాల లారీలు రిజిస్ట్రేషన్ జరిగినట్లు ఆయన తెలిపారు. పన్నులు, ఫీజులు రూపంలో రవాణాశాఖ ద్వారా ప్రభుత్వానికి రూ.23 లక్షలు ఆదాయం సమకూరిందన్నారు.